సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు తాళాలు అందజేస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

- టిడ్కో ఇళ్ల సముదాయాన్ని ప్రారంభించిన ఆ సంస్థ చైర్మన్ ప్రసన్నకుమార్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు
- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

పెదగంట్యాడ: రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం సొంతగూడు లేకుండా ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. అందుకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నిజం చేయడానికి సంకల్పించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రవేశపెట్టి పేదలందరికీ గృహయోగం కల్పించారు. మరోవైపు ఏపీ టిడ్కో హౌసింగ్ పథకం కింద పేదలకు సకల సదుపాయాలతో గృహ సముదాయాలను నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించి అందజేస్తున్నారు. గాజువాక నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను గురువారం ప్రారంభించి లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. గాజువాక నియోజకవర్గం పరిధిలోని భానోజీతోట, దయాల్‌నగర్, బర్మా కాలనీలో కొత్తగా నిర్మించిన టిడ్కో గృహ సముదాయాన్ని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించి, లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కలను నిజం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణాలు ప్రారంభించినప్పటికీ అరకొర బడ్జెట్ కారణంగా నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అదనంగా నిధులు కేటాయించి నిర్మాణాలు పూర్తి చేయడమే కాకుండా, మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ చేయించి లక్షలాది రూపాయల విలువైన సొంతింటి కలను నిజం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, నాయకులు స్వామినాయుడు, బొడ్డ గోవింద్, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, లోకనాథం, ఇరోతి గణేష్, జుత్తు లక్ష్మీ, మంత్రి మంజుల తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద లబ్ధిదారులసందడి

లబ్ధిదారులకు అందించిన గృహాలు..

దయాల్‌నగర్‌లో..	
బ్లాకులు	14
365 ఎస్ఎఫ్‌టీ	192
430 ఎస్ఎఫ్‌టీ	480
మొత్తం	672
ఖర్చు మొత్తం	రూ.49.79 కోట్లు
భానోజీతోటలో	
బ్లాకులు	22
300 ఎస్ఎఫ్‌టీ	192
365 ఎస్ఎఫ్‌టీ	384
430 ఎస్ఎఫ్‌టీ	480
మొత్తం	1056
ఖర్చు మొత్తం	రూ.81.68 కోట్లు
బర్మా కాలనీలో..	
బ్లాకులు	1
365 ఎస్ఎఫ్‌టీ	48
మొత్తం	48
ఖర్చు మొత్తం	రూ.3.03 కోట్లు

ఆర్థిక ఇబ్బందులు తప్పాయి



జగనన్న ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేరింది.. ఇప్పటి వరకూ అద్దె ఇంట్లో ఉండేవాళ్లం.. ఆర్థికంగా ఇబ్బందులు పడేవాళ్లం.. మా జీవితంలో సొంతిల్లు కలగానే మిగిలిపోతుందని అనుకున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా సొంత ఇంటి కలను సాకారం చేశారు. పేదల సంక్షేమం కోసం పని చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. ఆయన ఉంటేనే పేదలకు న్యాయం జరుగుతుంది.

–బి.శ్రావణి, సంజీవకాలనీ, పెదగంట్యాడ

చాలా సంతోషంగా ఉంది



గత ప్రభుత్వ హయాంలో ఇంటి కోసం కాళ్లరిగేలా తిరిగేవాళ్లం. సొంతిల్లు లేకపోవడంతో దశాబ్దాలుగా అద్దె ఇంట్లోనే జీవనం సాగించాం. చాలా కాలంగా ప్రభుత్వం అందించే ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాం. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇల్లు రాలేదు. కానీ వైఎస్సార్‌సీపీ వచ్చిన తర్వాత మాకు గృహయోగం కల్పించారు. చాలా సంతోషంగా ఉంది.

–కరణం నాగజ్యోతి, నడుపూరు, పెదగంట్యాడ

ప్రభుత్వ సేవలు బాగున్నాయి



పేదలకు సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్నారు. ప్రభుత్వం సేవలు బాగున్నాయి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటున్నారు. అర్హత ఉన్నప్పటికీ మాకు గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరు చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలపై ప్రత్యేక దృష్టి సారించి నవరత్నాలు–అందరికీ ఇళ్లు పథకాన్ని అమలు చేసి మాకు ఇంటిని కేటాయించారు.

–పి.సావిత్రి, సుందరయ్య కాలనీ, గాజువాక

జగనన్నకు రుణపడి ఉంటాం



శ్రీనగర్‌లో పదేళ్ల నుంచి అద్దె ఇంట్లో ఉంటున్నాం. టీడీపీ ప్రభుత్వ హయాంలో సొంతింటి కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. జగనన్న ప్రభుత్వం రాకతో సొంతింటిని అందజేశారు. కుటుంబమంతా సొంతింట్లో దర్జాగా బతుకుతాం. నిరుపేదలకు అండగా ఉంటూ నీతిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–మైనేని శ్రీధరణి, శ్రీనగర్, గాజువాక

క్లుప్తంగా

విద్యార్థులకు ఘన వీడ్కోలు



విద్యార్థులకు వీడ్కోలు పలుకుతున్న ఉపాధ్యాయులు

గాజువాక : స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో చదువు పూర్తి చేసుకొన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు అత్యుత్తమ మార్కులను సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఆర్.కవిత, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు మనోధైర్యాన్ని కోల్పోవద్దు



సేవా రత్న అవార్డు గ్రహీత సుభాషిణిని సత్కరిస్తున్న గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా ఉన్న వలంటీర్ల సేవలు మరువలేనివని 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ అన్నారు. గురువారం వార్డులో సచివాలయంలో సేవా రత్న, సేవా మిత్ర సాధించిన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ రాజకీయ పక్షాల నుంచి విమర్శలు, ఒత్తిళ్లు, బెదిరింపులు వచ్చే అవకాశం ఉందని, అటువంటి సమయంలో మనోధైర్యాన్ని కోల్పోవద్దని అన్నారు. ఇలాంటి సంఘటనలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంగ్రాన నూకరాజు, గొంతిన శ్రీనివాసరావు, శ్యాంబాబు, ఆదిబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం: కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడులు నిర్వహించి ఓ వ్యక్తి నుంచి 20 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గాజువాక ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్, ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో లక్ష్మీన్నాయుడు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి టోల్ గేటు సమీపంలో రాజీవ్‌నగర్‌లో రోడ్డులో ఒక వ్యక్తి కర్ణాటకు చెందిన మద్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. అతని నుంచి 20 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎస్.రమ్య శ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' సేవలు భేష్

పెదగంట్యాడ: ఆరోగ్య సురక్ష పథకంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ 76వ వార్డు నాయకుడు దొడ్డి రమణ అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని సచివాలయం–4కు సంబంధించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ బాబు, వైద్య సిబ్బంది రోగులను పరీక్షించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

కూర్మన్నపాలెం : కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన ఎదుర్కొంటామని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,127వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్

నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి శంకుస్థాపన



స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆడుదాం–ఆంధ్రాయే దీనికి ఉదాహరణ అని చెప్పారు. జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని వుడా కాలనీ వినాయకనగర్‌లో గల ఆదర్శగ్రౌండ్‌లో కొత్తగా నిర్మించనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభ గల క్రీడాకారులు ఉన్నారని, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారన్నారు. క్రీడాకారుల కోసం ఇక్కడ రూ.5కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులకు అవసరమైన ఆట వస్తువులతో పాటు వారికి శిక్షణ ఇచ్చేందుకు నిష్ణాతులను నియమించనున్నామన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిమ్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ తదితర క్రీడలకు సంబంధించి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వాలు క్రీడాకారులను నిర్లక్ష్యం చేశాయని చెప్పారు. కార్పొరేటర్ భూపతిరాజు సుజాత మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇంతపెద్ద మైదానం ఉన్నా అందులో సౌకర్యాలు లేకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహపడేవారన్నారు. ఈ నేపథ్యంలో వారికి ప్రోత్సాహాన్ని అందించేందుకు, ఇక్కడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ పనులను శరవేగంగా పూర్తి చేసి క్రీడాకారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భూపతిరాజు శ్రీనివాసరాజు, వత్సవాయి రామకృష్ణంరాజు, కంది పైడినాయుడు, గొరుసు సత్యంరెడ్డి, పాల అప్పలరెడ్డి, జయప్రభ, గొందేశి వెంకటరమణారెడ్డి, త్రివేణి, వరలక్ష్మి, మంజు, ఆదిలక్ష్మి ఛ అప్పారావు, గీత, రామకృష్ణ, ఆలీ పాల్గొన్నారు.

2 వేల మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న గుడివాడ లతీష్



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ తిలక్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న లక్ష్యమని 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ అన్నారు. వార్డు పరిధి గుడివాడ అప్పన్నకాలనీ రామాలయం వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 2 వేల మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో 68వ వార్డు యూపీహెచ్‌సీ ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిలక్ కుమార్, వైద్యులు నాగరాజు, అహ్మద్, హరి కిషోర్, ధనలక్ష్మి, నగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్, సచివాలయ కన్వీనర్ గుర్రం త్రినాథ్, నాయకులు ఈటి శ్యామలరావు, అమ్మాజీ, కోటేశ్వరరావు, గోవిందు, శ్రీరామ్, మూర్తి, జనార్దన్, ఆశా వర్కర్లు, సచివాలయ ఏఎన్ఎం, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య సమస్యను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

గాజువాక : గాజువాక ప్రాంతంలో కాలుష్య సమస్య నివారణకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. గాజువాకలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగవరం పోర్టు నుంచి రవాణా సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా కాలుష్యం మరింత పెరిగిందన్నారు. కనీస నిబంధనలు పాటించకుండా భారీ వాహనాల్లో బొగ్గుతోపాటు ఇతర మెటీరియల్‌ను తీసుకెళ్తున్నారని, నిబంధనలు పాటించని కారణంగా ఆ మెటీరియల్ రోడ్డుపై పడి కాలుష్యానికి కారణమవుతోందన్నారు. ఈ కాలుష్యంవల్ల స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని, అనేకమంది మహిళలకు గర్భస్రావాలు అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించడం కోసం గంగవరం పోర్టునుంచి వెళ్తున్న వాహనాలను దారి మళ్లించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ గంగారావు, నాయకులు రాంబాబు, శ్రీనివాసరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేత



పరీక్ష మెటీరియల్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పినడమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు లయన్స్‌క్లబ్ అగనంపూడి కమిటీ పరీక్ష మెటీరియల్‌ను అందించింది. కార్యక్రమంలో మోటివేటర్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సులభంగా ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా డీసీ బోర్డు స్టడీ మెటీరియల్ తయారు చేశామన్నారు. పాఠశాల హెచ్ఎం వై.భీమశంకరరావు, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ కిడిమి హనుమంతురావు ,లయన్స్‌క్లబ్ ప్రతినిధి పిళ్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సౌత్ ఏషియన్ ఎల్‌పీజీ కంపెనీ లిమిటెడ్ సంస్థ సీఈవో సంజయ్ గుహ, ఆర్‌టీవో ఆర్.సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. గురువారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సౌత్ ఏషియన్ ఎల్‌పీసీ కంపెనీ లిమిటెడ్ వారు యునైటెడ్ రోడ్ సెఫ్టీ పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. 120 మంది విద్యార్థులకు డ్రాయింగ్ మెటీరియల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. పోటీల్లో గెలుపొందిన ఐదుగుర్ని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఇన్‌చార్జ్ హెచ్ఎం జి.కుమారస్వామి, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు బి.రవి చంద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎస్సార్, టీబీకేలో రేపు జాబ్‌మేళా

గాజువాక : బ్రిన్ ట్రస్ట్, కల్చర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ట్రస్టు ప్రతినిధి పేర్ల అప్పారావు తెలిపారు. ఈ మేళాకు యువతీ యువకులతో పాటు దివ్యాంగులు కూడా హాజరుకావచ్చని తెలిపారు. విప్రో, అమేజాన్, కాన్సెంట్రిక్స్, యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, రిలయన్స్, మ్యాక్స్, డి మార్టు, వరుణ్ మోటార్స్ తదితర 24 కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందన్నారు. వివరాల కోసం 9032620269, 7386834194 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

గాజువాక : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. ఎనిమిదో తరగతి కనీస విద్యార్హత కలిగి 18–45 సంవత్సరాల వయోపరిమితిగల స్త్రీ, పురుషులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 8309003957 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మస్తానప్ప

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తోందని యూనియన్ గౌరవాధ్యక్షుడు వై.మస్తానప్ప అన్నారు. గురువారం ఎల్ఎంఎం పార్కులో జరిగిన యూనియన్ సైటు లీడర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకత కోసం శక్తి వంచన లేకుండా కృషి చేసి ప్లాంట్ అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పిట్టారెడ్డి మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణకు తమ యూనియన్ గట్టి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బి. శశిభూషణ్‌రావు, పి. సంజీవరెడ్డి, బి. అప్పలరాజు, జి. వెంకటలక్ష్మి, రాజా, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత



71వ వార్డులో రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తున్న కార్పొరేటర్ రాజాన రామారావు



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న 87వ వార్డు ఇన్‌చార్జి శ్రీనివాసరావు

గాజువాక : జగనన్న ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు గురువారం పలువురు కార్పొరేటర్లు, నాయకులు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే అమలు చేస్తారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను నిర్విరామంగా కొనసాగించడం కోసం, అభివృద్ధి కోసం ఆయన్ని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. 71వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు చేతులమీదుగా ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పప్పల రాజు, ఆర్టీసీ రాజు, కటికల కల్పన, శేషు, ఆచారి, రామరాజు, ఎ.వి. రమణ, బొండా అప్పారావు, నాగేశ్వరరావు, వెంకటేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.72వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు సిరట్ల శ్రీనివాస్ చేతులమీదుగా జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ కుమార్ సాయి పాల్గొన్నారు.

68వ వార్డులో ..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు చిన్న అక్కిరెడ్డిపాలెం సచివాలయం పరిధిలో ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ అందజేశారు. సచివాలయం పరిధిలో 316 మంది లబ్ధిదారులకు ఈ డాక్యుమెంట్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంగ్రాన నూకరాజు, నేలపాటి శ్యాంబాబు, గొంతిన శ్రీనివాసరావు, ఆదిబాబు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ డి.సత్యన్నారాయణ, ఎడ్మిన్ ఎస్.రేఖ, వార్డు ఎమినిషన్ ఎన్.అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం : రాష్ట్రంలో ఇళ్లలేని పేదల సొంతింటి కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారని 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు అన్నారు. వార్డు పరిధిలోని పలువురు లబ్ధిదారులకు గురువారం రిజిస్ట్రేషన్‌తో కూడిన ఇళ్లపట్టాల డాక్యుమెంట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, కోమటి రమాదేవి, వర్రె రాజు, బొడ్డు సుమంత్, వాలంటీర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాది పేదల ప్రభుత్వం

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ పేదల ప్రభుత్వమని 85వ వార్డు సీనియర్ నాయకులు ఎల్.వి.రమణ, వై.చిన అప్పారావు అన్నారు. 85వ వార్డు దిబ్బపాలెం వార్డు సచివాలయ పరిధిలోని 130 మంది అర్హులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి సొంతిల్లు ఉండాలనే సంకల్పంలో రాష్ట్రంలో 30లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు బొట్టా గంగరాజు, టి. చంద్రమౌళి, వార్డు సచివాలయ అడ్మిన్ ఎ.దిలీప్, సంక్షేమ కార్యదర్శి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.48.43 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : పాతగాజువాక నుంచి కూర్మన్నపాలెం జంక్షన్ వరకు జాతీయ రహదారి సెంట్రల్‌మీడియన్ పెయింటింగ్స్, ఎంఎస్ గ్రిల్స్ మరమ్మతులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనగర్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. గాజువాక నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చి దిద్దామన్నారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, స్థానిక నాయకులు విశ్వనాథం, ఆనంద్, చిన్నయ్య, అర్జున్, వెంకటేశ్వరరావు, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం లక్ష్యం



87వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం : ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో కోటీ 94 లక్షల 30 వేల రూపాయల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ముఖ్యంగా 87వ వార్డు సిద్దార్థనగర్‌లో కోటి 44 లక్షల 80 వేల రూపాయలతో శ్మశాన వాటిక అభివృద్ధి, శివాజీనగర్ చిల్డ్రన్స్ పార్క్‌ను 49 లక్షల 5 వేల రూపాయలతో అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం పలు ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నేరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారని, ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కోమటి శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు బొడ్డ గోవింద్, కోమటి రమాదేవి, ప్రగడ శ్రీనివాస్, వడ్లపూడి ఈశ్వరరావు, వేముల వెంకన్న, కణితి నగేష్, చినబాబు, రామరాజు, జొన్నకేటి విజయ్‌కుమార్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.